క్లుప్తంగా

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం




దాతకు బాండ్ అందిస్తున్న సూపరింటెండెంట్

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి వేపగుంటకు చెందిన వీర వెంకట శ్వేత, కార్తీక్ అమర్‌నాథ్ రూ.లక్ష విరాళాన్ని గురువారం అందించారు. సంబంధిత విరాళాన్ని సింహగిరిపై ఉన్న పీఆర్వో కార్యాలయంలో నగదు రూపంలో ఇచ్చారు. దేవస్థానం తరఫున దాతకు సూపరింటెండెంట్ విక్రమ్ బాండ్ అందించారు. ఆలయ అధికారులు స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు.

కాలేజీ విద్యార్థులకు యూనిఫాంల పంపిణీ

పెందుర్తి: మండలంలోని రాంపురం జిల్లా పరిషత్ హైస్కూల్ ప్లస్‌లోని బాలికల జూనియర్ కాలేజీ విద్యార్థులకు యూనిఫాంలు గురువారం పంపిణీ చేశారు. కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ ఇనిస్టిట్యూట్(గైస్) ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ తన గురువు బొబ్బిలి శ్రీరామమూర్తి 75 ఏళ్ల పూర్తి చేసుకుని వసంతోత్సవం నిర్వహించుకున్న సందర్భంగా ఈ యూనిఫాంను అందజేశారు. పాఠశాల హెచ్ఎం కె.రాము చేతుల మీదుగా విద్యార్థులకు వీటిని అందించారు. కార్యక్రమంలో లెక్చరర్లు కె.జయప్రసాద్, కె.వెంకటరావు, సతపతి, చక్రవర్తి, శ్రీదేవి, బీబీ పాల్గొన్నారు. యూనిఫాం అందించిన ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణకు విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

వారాహి అమ్మవారికి క్షీరాభిషేకం



సహస్రాక్షి అమ్మవారు

సబ్బవరం: ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం దేవీపురంలోని సహస్రాక్షి రాజరాజేశ్వరీదేవి క్షేత్రంలో వారాహి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఉత్సవమూర్తికి భక్తులచే క్షీరాభిషేకం, షోడశోపచార సహిత కుంకుమ పూజలు గురువారం నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి సన్నిధిలో శ్రీలలితా సహిత శ్రీవారాహి హోమం జరిగింది. అమ్మవారికి చివరి రోజైన శుక్రవారం నవవర్ణ శోభిత పుష్పాలంకరణ జరుగుందని గురుమాత అన్నపూర్ణమ్మ తెలిపారు. మధ్యాహ్నం అమ్మవారి సన్నిధిలో అన్న సమారాధన జరిపారు.

కల్తీ మద్యం నిందితులపై చర్యలు తీసుకోవాలి



కల్తీ మద్యానికి వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న ఐద్వా కార్యకర్తలు

పరవాడ: కల్తీ మద్యం తయారీదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) జిల్లా అధ్యక్షురాలు పి.మాణిక్యం డిమాండ్ చేశారు. ఐద్వా ఆధ్వర్యంలో పరవాడ సబ్‌స్టేషన్ కూడలిలో నకిలీ మద్యం ఘటనపై ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా మాణిక్యం మాట్లాడుతూ ఇప్పటికే మద్యానికి చాలా మంది బలవుతున్నారని, ఇప్పుడు కల్తీ మద్యంతో మరింత మంది మంది ప్రాణాలు పోగొట్టుకునే పరిస్థితి నెలకొందన్నారు. మండలంలో విచ్చల విడిగా బెల్ట్ షాపులు నడుపుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కల్తీ మద్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో తుంపాల అన్నపూర్ణ, ఎం.బంగారమ్మ, ఎస్.అలేఖ్య, నాగదేవి, సాయివెంకట్, లక్ష్మి, రాజకుమారి, పోలమ్మ, మంగ తదితరులు పాల్గొన్నారు.

లారీ డ్రైవర్‌కు జైలు, జరిమానా

విశాఖ లీగల్: లారీని నిర్లక్ష్యంగా అతివేగంగా నడిపి ఒక వ్యక్తి మృతికి కారణమైన డ్రైవర్‌కు ఏడాది కఠిన కారాగార శిక్ష, రూ.6,000 జరిమాన విధిస్తూ నగరంలోని జ్యుడీషియల్ ప్రధాన మెజిస్ట్రేట్ ఎం.ప్రదీప్ కుమార్ గురువారం తీర్పు నిచ్చారు. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా రెండు నెలలు సాధారణ జైలు శిక్ష అనుభవించాలని న్యాయమూర్తి తన తీర్పులో స్పష్టం చేశారు. సీనియర్ అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ మైలపల్లి ఆదినారాయణ అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. సాగర్‌నగర్‌కు చెందిన పల్లా అప్పలరాజు (40) లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. జార్ఖండ్‌కు చెందిన జనార్దన్ ఝా 2022 డిసెంబర్ 21వ తేదీన విశాఖ ఓడరేవు ప్రాంతంలోని లక్ష్మీ కాటా దగ్గరకు వచ్చి తన లారీలోని సరుకును తూస్తున్నాడు. అప్పలరాజు మరో టిప్పర్‌లో వెనుక నుంచి వచ్చి బలంగా లారీని ఢీకొన్నాడు. పక్కనే ఉన్న డ్రైవర్ జనార్దన్ అక్కడికక్కడే మృతి చెందాడు. హార్బర్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ బి.సత్యనారాయణ శ్రీనివాస్ కేసు విచారణ జరిపి నిందితుడిపై భారతీయ శిక్షాస్మృతి సెక్షన్ 304ఎ ప్రకారం కేసు నమోదు చేశారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తిపై పైవిధంగా తీర్పునిచ్చారు.



ఒమ్మివానిపాలెం సమీపంలో రైవాడ కాలువను అనుకుని చేపడుతున్న గ్రావెల్ తవ్వకాలు

- యథేచ్ఛగా మండలంలో గ్రావెల్ తవ్వకాలు
- ప్రభుత్వ భూములు, కొండవాలు ప్రాంతాలే లక్ష్యం
- సహకరిస్తున్న కూటమి పార్టీల నేతలు
- కన్నెత్తి చూడని రెవెన్యూ, మైనింగ్, పోలీస్ అధికారులు

గ్రావెల్ దందా.. కూటమి అండ

సబ్బవరం మండలంలో గ్రావెల్, మట్టి అక్రమ తవ్వకాలకు అడ్డూ అదుపూ లేకుండా పోతోంది. యంత్రాలతో తవ్వకాలు చేస్తూ, టిప్పర్లు, ట్రాక్టర్ల ద్వారా గంటల వ్యవధిలోనే కొండల్ని గుట్టలుగా, గుట్టల్ని గోతులుగా మార్చేస్తున్నారు. ఈ గ్రావెల్, మట్టిని లేఅవుట్లు, ఇతర వాణిజ్య అవసరాలకు విక్రయిస్తూ దండిగా సొమ్ము చేసుకుంటున్నారు. అడ్డుకోవాల్సిన మైనింగ్, ఇరిగేషన్, రెవెన్యూ, పోలీస్ యంత్రాంగమే అక్రమార్కులకు కొమ్ముకాస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

సబ్బవరం: మండలంలో గ్రావెల్ మాఫియా రెచ్చిపోతోంది. ప్రభుత్వ భూములు, కొండవాలు ప్రాంతాలు, ప్రభుత్వ లేఅవుట్‌లలో తవ్వకాలు చేపడుతూ గ్రావెల్, మట్టి యథేచ్ఛగా తరలించుకుపోతున్నారు. ప్రభుత్వం నుంచి గ్రావెల్ తవ్వకాలకు అనుమతుల్లేకపోవడంతో మండలంలో గ్రావెల్‌కు విపరీతమైన డిమాండ్ నెలకొంది. దీన్ని ఆసరాగా తీసుకున్న గ్రావెల్ మాఫియా ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ భారీ మొత్తంలో దండుకుంటోంది. అనధికార తవ్వకాల నేపథ్యంలో ఒక్కో లోడ్ గ్రావెల్‌కు రూ.4 వేలు నుంచి రూ.6 వేలు వరకు వసూలు చేస్తున్నారు. లోడింగ్ వ్యయం పోనూ లోడ్‌కు రూ.3 వేలు నుంచి రూ.5 వేలు మిగులుతుంది. దీంతో రోజుకు వందల లోడ్లు వేసినా.. రూ.5 లక్షల ఆదాయం. దీన్లో అందరికీ వాటాలున్నాయని సమాచారం.



సబ్బవరంలో గ్రావెల్‌తో ఫిల్ చేస్తున్న ఓ బేస్‌మెంట్

రూ.లక్షల్లో ఫిల్లింగ్ కాంట్రాక్ట్‌లు

సబ్బవరం పరిసర ప్రాంతం వేగంగా అభివృద్ధి చెందుతోంది. దీంతో నిర్మాణ రంగం కాస్త ఊపందుకుంది. పలు లేవుట్‌లు అభివృద్ధి చెందుతున్నాయి. ఈ నేపథ్యంలో బేస్‌మెంట్లు, లేఅవుట్‌ల ఫిల్లింగ్‌లో గ్రావెల్, మట్టికి విపరీతమైన డిమాండ్ ఉంది. వీరి అవసరాలను దృష్టిలో ఉంచుకుని గ్రావెల్ మాఫియా బేస్‌మెంట్లు, లేఅవుట్‌ల ఫిల్లింగ్ కాంట్రాక్ట్‌లు దక్కించుకుంటున్నాయి. పొక్లెయిన్లు, టిప్పర్ లారీలతో రాత్రి పూట గంటల వ్యవధిలోనే సమీపంలోని ప్రభుత్వ భూములు, కొండవాలు ప్రాంతాల్లో తవ్వకాలు చేపట్టి ఫిల్లింగ్ పూర్తి చేస్తున్నారు. వారి నుంచి రూ.లక్షల్లో దండుకుంటున్నారు.

గ్రావెల్ దందా ప్రాంతాలివే..

మండలంలోని జీవీఎంసీ పరిధి గంగవరం, నంగినారపాడు, అజనగిరి, మండల కేంద్రం సబ్బవరంలోని అసకపల్లి సర్వే నెం.1లోని వజ్రాల కొండ, అంతకాపల్లి శివారు ఒమ్మువానిపాలెం సమీపంలోని రైవాడ కాలువ వద్ద, నల్ల కొండ రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతం, గాలిభీమవరం, అయ్యన్నపాలెం, పైడివాడ అగ్రహారం, గొల్లలపాలెం, ఎల్లుప్పి, అమృతపురం, రాయపుర అగ్రహారంలోని కొండవాలు ప్రాంతాలు, ప్రభుత్వ భూము లు, ప్రభుత్వ గృహ లేఅవుట్లలో ఎక్కువగా గ్రావెల్, మట్టి దందా జరుగుతోంది. ఆయా ప్రాంతాల్లో రాత్రి పూట యథేచ్ఛగా గ్రావెల్, మట్టి తవ్వుకుపోతున్నారు. అధికారులు, కూట మి నేతల అండదండలతో పాటు దారిపొడవునా తమ వేగుల్ని ఏర్పాటు చేసుకుని, దాడుల సమయంలో తప్పించుకుంటున్నారు.



దంపర్లతో తరలించుకుపోతున్న గ్రావెల్

గంటల వ్యవధిలో వందల లోడ్లు

కాలం మారింది. తట్ట, పలుగు పట్టుకుని గ్రావెల్, మట్టి తరలించే రోజులు పోయాయి. ఆధునిక యంత్ర సామగ్రిని వినియోగించి అక్రమార్కులు గంటల వ్యవధిలోనే పని ముగించేస్తున్నారు. వందల లోడ్ల మట్టి, గ్రావెల్ తరలిస్తూ రోజూ రూ.లక్షల్లో ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. వీరికి స్థానిక కూటమి నేతల అండదండలు పుష్కలంగా ఉండటంతో.. రెవెన్యూ, మైనింగ్, పోలీస్, ఇరిగేషన్ అధికారులు అటువైపు కన్నెత్తి చూడట్లేదన్న ఆక్షేపణలున్నాయి.

ఎమ్మెల్యే మౌనం వెనుక..

కూటమి ప్రభుత్వ అధికారం చేపట్టాక పలు మార్లు ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు గ్రావెల్ అక్రమ తవ్వకాలపై బాహాటంగానే తన వ్యతిరేకతను వెల్లడించారు. ప్రధానంగా రెవెన్యూ, మైనింగ్, పోలీస్ అధికారులు చర్యలు తీసుకోవట్లేదని బహిరంగ ఆక్షేపణలు చేశారు. ప్రస్తుతం మండలంలో ఇంతగా గ్రావెల్ దందా జరుగుతున్నా.. ఆయన నిమ్మకునీరెత్తినట్లుగా ఉండటాన్ని స్థానికులు ఆక్షేపిస్తున్నారు. గ్రావెల్ అక్రమ తవ్వకాలకు కూటమి నేతల సహాయ సహకారాలున్నాయని బహిరంగ విమర్శలు చేస్తున్నారు.



అక్రమ గ్రావెల్ తవ్వకాలతో కనుమరుగవుతున్న అసకపల్లి వజ్రాలకొండ

క్రిమినల్ చర్యలు తీసుకుంటాం



గ్రావెల్ అక్రమ తవ్వకాల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే పలు గ్రామాల్లో గ్రావెల్ తరలించే ప్రదేశాలను గుర్తించి, పరిశీలించాం. స్థానిక పోలీ సులతో కలిసి ఎప్పటికప్పుడు దాడులు చేస్తున్నాం. ఆయా గ్రామాల్లో వీఆర్వోలను అప్రమత్తం చేశాం. గ్రావెల్ తరలించే వారు చిక్కితే క్రిమినల్ కేసులు నమోదు చేసి, కఠిన చర్యలు తీసుకుంటాం. –బి.చిన్నికృష్ణ, తహసీల్దార్, సబ్బవరం మండలం

వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశం నేడు

సబ్బవరం: వైఎస్సార్‌సీపీ నియోకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో పెద్ద ఎత్తున పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త అన్నంరెడ్డి అదీప్‌రాజ్ గురువారం ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. మండలంలోని ఇరువాడలో ఉన్న జీఎస్ కన్వెన్షన్ హాల్లో శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు సమావేశం ప్రారంభం కానుందన్నారు. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రతి గ్రామంలో చంద్రబాబు చేసిన మోసాలను ప్రజలకు తెలిసేలా బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. దీనిలో భాగంగా నియోజకవర్గ స్థాయిలో కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించేందుకు ఈ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. జిల్లా స్థాయిలో నిర్వహించే కార్యక్రమాన్ని అనకాపల్లిలో ఇప్పటికే జరిగిందన్నారు. ఈ సమావేశానికి మాజీ మంత్రి, పార్టీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్, మాజీ ప్రభుత్వ విప్, అనకాపల్లి పార్లమెంట్ ఇన్‌చార్జ్ కరణం ధర్మశ్రీ, జిల్లా పార్టీ పరిశీలకులు, మాజీ ఎమ్మెల్యే శోభా హైమావతి హాజరుకానున్నట్లు పేర్కొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

సబ్బవరం: మండలంలోని సబ్బవరం సెక్షన్–1, 2, అంతకాపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధి గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనున్నట్లు ఈపీడీసీఎల్ ఈఈ ఎస్.రామకృష్ణ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. దీంతో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సబ్ స్టేషన్ల పరిధిలోని సబ్బవరం, తవ్వవానిపాలెం, అమృతపురం, గొల్లలపాలెం, పైడివాడ, పెదగొల్లలపాలెం, అసకపల్లి, ఇరువాడ, గొటివాడ, ఆరిపాక, అంతకాపల్లి, గుల్లేపల్లి, మొగలిపురం, మల్లునాయుడుపాలెం, అయ్యన్నపాలెం, బంగారమ్మపాలెం, నాయనమ్మపాలెం, ఎల్లుప్పి, వంగలి, గాలిభీమవరం, అద్దూరు పంచాయతీల్లో విద్యుత్ సరఫరా ఉండబోదన్నారు. ఆయా గ్రామాల్లోని వినియోగదారులు తమ సిబ్బందికి సహకరించాల్సిందిగా కోరారు.

సింహాచలం: దారపాలెం, పష్కరిణి 11 కేవీ ఫీడర్ల పరిధిలో నిర్వహణ పనుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్‌శాఖ ఈఈ పి.శ్రీనివాసరావు తెలిపారు. అడవివరంలోని పాతగోశాల జంక్షన్, సింహాచలం ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతం, ప్రభుత్వ ఆస్పత్రి ఏరియా, ప్రియాగార్డెన్స్, సాయినగర్, కోనేరు రోడ్డు, విజినిగిరిపాలెం, కుమ్మరిదిబ్బ, అడవివరం జంక్షన్, దారపాలెం తదితర ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుస్ సరఫరా ఉండబోదని, ప్రజలంతా సహకరించాలని కోరారు.

అధ్వాన రోడ్డులో అదుపు తప్పుతున్న లారీలు

సబ్బవరం: మండలంలోని సబ్బవరం–చోడవరం రోడ్డు నుంచి రాయపుర అగ్రహారం మీదగా వంగలిలోని పెట్రో, మారిటైం జాతీయ విశ్వవిద్యాలయాలకు వెళ్లే రోడ్డులో ప్రయాణికులు, వాహనచోదకులు నరకయాతన అనుభవిస్తున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు రోడ్డులోని గోతుల్లో నీరు చేరి, ఇరుగ్గా మారింది. దీంతో ఈ రోడ్డులో వర్సిటీలకు నిర్మాణ సామగ్రి తరలిస్తున్న లారీలు ఎక్కడికక్కడే దిగబడిపోతున్నాయి. గురువారం కూడా నిర్మాణ సామగ్రితో వస్తున్న డంపర్ ఎదురుగా వస్తున్న మరో వాహనానికి దారిచ్చే ప్రక్రియలో అదుపు తప్పి, ఓ పక్కకు ఒరిగిపోయింది. రోజూ ఒకటి రెండు వాహనాలకు ఇదే దుస్థితి ఎదురవుతోంది. దీంతో వాహనాలు నడిపే డ్రైవర్లు, సంస్థల యాజమాన్యాలు తలలు పట్టుకుంటున్నాయి. ఈ రోడ్డును తక్షణమే అభివృద్ధి చేయాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.



వర్సిటీలకు వెళ్లే రోడ్డులో రాయపుర అగ్రహారం వద్ద ఒరిగిపోయి, నిలిచిపోయిన లారీ

దేశవ్యాప్త సమ్మె జయప్రదం చేయాలి

పరవాడ: లేబర్ కోడ్‌లు రద్దు చేయాలన్న డిమాండ్‌తో ఈ నెల 9న నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మెలో కార్మికులంతా పాల్గొని, జయప్రదం చేయాలని సిటు జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ పిలునిచ్చారు. పరవాడలో గురువారం జరిగిన సమావేశంలో సమ్మె కరపత్రాన్ని సిటు నాయకులు ఆవిష్కరించారు. కార్మికుల పోరాటాల ద్వారా సాధించిన కార్మిక చట్టాలను యాజమాన్యాలకు అనుకూలంగా మార్పులు చేసే చర్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. 44 కార్మిక చట్టాలను బీజేపీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్స్ కింద మార్చి, అమలుకు ప్రయత్నిస్తోందని ఆక్షేపించారు. ఈ చట్టాలు అమలైతే ఇప్పుడున్న కార్మిక హక్కులు ఉండబోవన్నారు. ప్రైవేటీకరణ, కాంట్రాక్టు పద్ధతిలో అతి తక్కువ జీతాలకు పనిచేయడం, పని భద్రత లేకపోవడం వంటి సమస్యలతో కార్మికులు ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో సిటు నాయకులు పైల అప్పారావు, గేదెల అప్పారావు, కె.నాయుడు, బి.శ్రీను తదితరులు పాల్గొన్నారు.



సమ్మె కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న సిటు నాయకులు

నేత్ర వైద్యంలో శంకర్ ఫౌండేషన్ రికార్డు

తొలి త్రైమాసికంలో 9,804 కంటి శస్త్రచికిత్సలు

సింహాచలం: 2025–26 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో నాయుడుతోటలోని శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి అద్భుత ప్రగతి నమోదు చేసినట్లు ఆస్పత్రి మేనేజింగ్ ట్రస్టీ కృష్ణకుమార్ తెలిపారు. ఆస్పత్రిలో గురువారం జరిగిన అభినందన సభలో ఆయన మాట్లాడారు. రికార్డు స్థాయిలో 9,804 కంటి శస్త్ర చికిత్సలు చేసినట్లు వెల్లడించారు. 53,587 మందికి ఓపీ సేవలందించామన్నారు. ఔట్‌రీచ్ గ్రామాల్లో 164 ఉచిత కంటి వైద్య శిబిరాలను నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఆయా గ్రామాల్లో 10,442 మందికి స్క్రీన్ టెస్టు చేసి 3,932 మందికి ఉచితంగా సర్జరీలు చేసినట్లు తెలిపారు. డీజీఎం పీఆర్ కె.బంగార్రాజు మాట్లాడుతూ సమాజ సేవలో భాగంగా శంకర్ ఫౌండేషన్ 57 శాతం కంటే ఎక్కువ కేటరాక్ట్ ఆపరేషన్లు ఉచితంగా నిర్వహించిందన్నారు. గ్లకోమా, రెటీనా సేవల నిర్వహణను ఈ త్రైమాసికంలో ప్రధానాంశంగా తీసుకున్నట్లు తెలిపారు. నగరంలోని మద్దిలపాలెం ,మధురవాడ, గాజువాక, శ్రీకాకుళంలో ఉన్న శంకర్ ఫౌండేషన్ శాఖలతో పాటు నాయుడుతోటలో ఉన్న ప్రధాన ఆస్పత్రితో కలిపి ఆల్‌టైమ్ రికార్డు సాధించినట్లు వెల్లడించారు.



నాయుడుతోటలోని శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి (ఇన్‌సెట్)అభినందన సభలో మాట్లాడుతున్న మేనేజింగ్ ట్రస్టీ కృష్ణకుమార్

నకిలీ మద్యం మాఫియాపై చర్యలు తీసుకోవాలి

పరవాడ: పారిశ్రామిక ప్రాంతమైన పరవాడలో నకిలీ మద్యం మాఫియా చెలరేగిపోతోందని, దీన్ని తక్షణమే అరికట్టాలని వైఎస్సార్‌సీపీ మండల మాజీ అధ్యక్షుడు బొద్దపు చిన్నారావు అధికారుల్ని డిమాండ్ చేశారు. నకిలీ మద్యం మాఫియా గుట్టును ఎక్సైజ్ అధికారులు బుధవారం బట్టబయలు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో అయన మీడియాతో గురువారం మాట్లాడుతూ పరవాడలో పలు చోట్ల నకిలీ మద్యం తయారీ యూనిట్లను పెట్టడం ఆశ్చర్యం కలిగించిందన్నారు. ప్రాణాంతకమైన స్పిరిట్, లిక్విడ్లను ఉపయోగించి తయారు చేసిన ఈ నకిలీ మద్యాన్ని బెల్ట్ షాపుల ద్వారా అమ్మకాలు సాగిస్తూ, ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని మండిపడ్డారు. ఈ మాఫియా వెనుక కూటమి పెద్దల హస్తం ఉండడంతో, వీరి ఆగడాలకు అడ్డూ అదుపూ లేకుండా పోతోందన్నారు.నకిలీ మద్యంతో సంబంధమున్న వ్యక్తులను అరెస్టు చేయాలని చిన్నారావు డిమాండ్ చేశారు.

కార్మికనగర్ చెరువులో హెచ్చరిక బోర్డు



హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తున్న రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ హరిప్రసూన, వీఆర్వో విజయ్

సాక్షి ఎఫెక్ట్..

పెందుర్తి: పెందుర్తి రెవెన్యూ పరిధిలోని భూ ఆక్రమణలపై రెవెన్యూ అధికారులు కన్నెర్రజేశారు. కార్మికనగర్ చెరువులోని ప్రభుత్వ భూమి ఆక్రమణలను పరిశీలించారు. పెందుర్తి మండల రెవెన్యూ పరిధిలో ఇటీవల చోటు చేసుకున్న భూ ఆక్రమణలపై 'సమయం చూసి చక్కబెట్టేశారు'శీర్షికన సాక్షిలో బుధవారం ప్రచురితమైన కథనంపై అధికారులు స్పందించారు. ఇన్‌చార్జి తహసీల్దార్ ఎ.సంతోష్‌కిరణ్ సిబ్బందితో కలిసి కార్మికనగర్, నరవ ప్రాంతాల్లోని భూ ఆక్రమణలను పరిశీలించారు. కార్మికనగర్‌లో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ హరిప్రసూన ఆధ్వర్యంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. ఆయా భూ ఆక్రమణలపై ఉన్నతాధికారులకు నివేదిక అందించినట్లు తెలిసింది.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే తీవ్ర చర్యలు

పెందుర్తి: నేర ప్రవృత్తి కలిగిన ప్రతి ఒక్కరిపై పోలీస్ నిఘా ఉంటుందని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.వి.సతీష్ కుమార్ హెచ్చరించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ఏ ఒక్కరినీ విడిచిపెట్టబోమని స్పష్టం చేశారు. పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని వేపగుంట బంటాకాలనీలో గురువారం వేకువజాము 5 గంటల నుంచి ఉదయం 7 వరకు 20 మంది బృందంతో కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. కాలనీలో అడుగడుగునా క్షుణ్ణంగా పరిశీలించారు. వాహనాల రికార్డులను తనిఖీ చేశారు. పత్రాలు సక్రమంగా లేని 8 వాహనాలను సీజ్ చేశారు. ఓ మద్యం బెల్ట్ దుకాణాన్ని గుర్తించి 8 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని నిర్వాహకుడిని అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రజలు తమ ప్రాంతాల్లో అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తుల గురించి ఆరా తీయాలని సూచించారు. అలాంటి వ్యక్తుల వాహనాలను, ఇతర సమాచారాన్ని తక్షణమే పోలీసులకు అందించాలని కోరారు. చోరీల నియంత్రణ, శాంతి భద్రతలు కాపాడే అంశంలో ప్రజల సహకారమే కీలకమన్నారు. రానున్న రోజుల్లో అనుమానాస్పద ప్రాంతాల్లో తనిఖీలు మరింతగా కొనసాగుతాయని పేర్కొన్నారు. ఎస్ఐలు స్వామినాయుడు, దేముడునాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.



వేపగుంట బంటాకాలనీ కార్డన్ సెర్చ్‌లో స్థానికులతో మాట్లాడుతున్న సీఐ సతీష్‌కుమార్

వివాదాస్పద వీఎంఆర్‌డీఏ భూమిలో రైతుల ఆందోళన

పరిహారం చెల్లించాలని డిమాండ్

పెందుర్తి: వేపగుంటలోని వీఎంఆర్‌డీఏ(వుడా) భూముల్లో వివాదం మళ్లీ రాజుకుంది. పరిహారం చెల్లించకుండా వీఎంఆర్‌డీఏ యంత్రాంగం పనులు చేపట్టడాన్ని బాధిత రైతులు ఆక్షేపిస్తున్నారు. తమకు తగిన న్యాయం చేయకుండా ఇక్కడ పనులు చేపట్టడానికి వీల్లేదంటూ గురువారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా స్థానిక నాయకుడు ముత్తా నాయుడు మాట్లాడుతూ దశాబ్దాలుగా ఇక్కడి భూముల్లో వివాదం నడుస్తోందని, భూముల ఫలసాయం పొందుతున్న రైతులకు పరిహారం విషయంలో తాత్సారం చేయడం దారుణమన్నారు. యోగాంధ్ర పేరుతో వీఎంఆర్‌డీఏ భూముల్ని చదును చేశారని, ఆ తరువాత రైతులు మొక్కలు వేసుకుంటే వీఎంఆర్‌డీఏ అధికారులు తొలగించడం అన్యాయమని పేర్కొన్నారు. ప్రభుత్వం స్పందించి తక్షణమే ఈ వివాదానికి పరిష్కారం చూపి 144 ఎకరాల్లో ఉన్న రైతులకు న్యాయం చేయాలని కోరారు. రైతులకు కార్పొరేటర్లు బల్ల శ్రీనివాసరావు, ముమ్మన దేముడు, రాపర్తి కన్నా, వివిధ పార్టీల నాయకులు, వేపగుంట గ్రామ పెద్దలు మద్దతుగా నిలిచారు.



ఆందోళన చేస్తున్న వేపగుంట రైతులు



వివాదాస్పద భూమి ఇదే..

లారస్ ల్యాబ్‌లో విజయవంతంగా మాక్ డ్రిల్

పరవాడ: విశాఖపట్నం ఫ్యాక్టరీస్ జాయింట్ చీఫ్ ఇన్‌స్పెక్టర్ జె.శివశంకరరెడ్డి ఆదేశాల మేరకు జేఎన్ ఫార్మాసిటీలోని లారస్ ల్యాబ్ యూనిట్–3లో గురువారం మాక్ డ్రిల్ నిర్వహించారు. మాన్యుఫ్యాక్చరింగ్ బ్లాక్‌లో పేలుడు సంభవించినట్లుగా, అత్యవసర పరిస్థితిని సృష్టించి సంబంధిత విభాగాలు తక్షణమే స్పందించి అత్యవసర చర్యలు చేపట్టాయి. క్షతగాత్రులుగా ఉన్న ఉద్యోగులను రెస్క్యూటీమ్ సురక్షితంగా బయటకు తీసి, ప్రాథమిక వైద్యం అనంతరం మెరుగైన చికిత్స కోసం సమీప వైద్య కేంద్రాలకు తరలించారు. సంస్థ అగ్నిమాపక సిబ్బంది, ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్‌లు సమన్వయంతో మంటలను అదుపులోకి తెచ్చారు. హెచ్ఆర్ విభాగం హెడ్ కౌంట్ నిర్వహించగా, మెయింటెనెన్స్ విభాగం అత్యవసర సేవలను అందించింది. అనంతరం జె.శివశంకరరెడ్డి మాక్ డ్రిల్‌ను సమర్థవంతంగా నిర్వహించిన సిబ్బందిని అభినందించారు.ల్యాబ్‌కు చెందిన వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది మాక్‌డ్రిల్‌లో కీలక పాత్ర పోషించారని లారస్ ల్యాబ్ అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ బోడేపూడి రామకృష్ణ తెలిపారు.



మాక్‌డ్రిల్‌లో పాల్గొన్న అధికారులు, సిబ్బంది

పారిశుధ్య నిర్వహణపై అవగాహన

సబ్బవరం: మండలంలోని మొగలిపురం గ్రామంలో ఎంపీడీవో పి.పద్మజ ఆధ్వర్యంలో ఇంటింటికీ పంచాయతీ సిబ్బందితో కలిసి వెళ్లి తడి–పొడి చెత్త సేకరణ, నిర్వహణపై గ్రామస్తులకు గురువారం అవగాహన కల్పించారు. గ్రామంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంలో వర్మీ కంపోస్టును పరిశీలించి వినియోగంపై చర్చించారు. వాటర్ ట్యాంకు శానిటేషన్ నిర్వహణపై ఆరా తీశారు. గ్రామ శివారు హనుమాన్ టెంపుల్ వద్ద గ్రామస్తులతో నీటి వినియోగం, తడి–పొడి చెత్తను వేరుచేసి అందించడం, బహిరంగ మల విసర్జన, వీధి కాల్వల నిర్వహణ, పరిసరాల పరిశుభ్రత తదితర అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో ఎంపీడీవోతోపాటు ఈవోపీఆర్డీ చైతన్య, పంచాయతీ కార్యదర్శి రజని, గ్రామ పెద్దలు తమరాణ బంగారినాయుడు, అంగటి నానాజీ, తమరాణ సత్యనారాయణ, మేడపాటి రాము, వెన్నెల శంకర్, కొటాన దేముడు, రాయవరపు శ్రీను తదితరులు పాల్గొన్నారు.



పారిశుధ్యంపై ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో పద్మజ తదితరులు